
సీతంపేట మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ వద్ద వేచిఉన్న ఓటర్లు


సీతంపేట వీటీ హైస్కూల్ వద్ద క్యూలో ఓటర్లు.. వృద్ధురాలిని ఓటేసేందుకు తీసుకొస్తున్న ఆమె మనుమరాలు


అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ ఆవరణలో బారులు తీరిన ఓటర్లు


నక్కవానిపాలెం పోలింగ్ బూత్‌లో ఓటేసేందుకు తరలివచ్చిన ప్రజలు

క్లుప్తంగా

జనసేన నాయకుడు బొడ్డేపల్లి రఘు ఓవరాక్షన్

- పోలీసులతో వాగ్వాదం


పోలీసులతో వాగ్వాదం చేస్తున్న బొడ్డేపల్లి రఘు

సీతమ్మధార: జనసేన పార్టీ నాయకుడు బొడ్డేపల్లి రఘు పోలింగ్ బూత్‌లో అతిగా ప్రవర్తించాడు. మర్రిపాలెం జ్యోతినగర్ జీవీఎంసీ ప్రైమరీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన 245 నంబర్ పోలింగ్ బూత్‌లో ఓటు వేయడానికి వచ్చిన ఆయన ఎక్కువ సేపు అక్కడే ఉండిపోవడంతో పోలీసులు ప్రశ్నించారు. ఓటు వేసి వెంటనే వెళ్లిపోవాలని రఘుకు సూచించారు. దీంతో రెచ్చిపోయిన జనసేన నాయకుడు పోలీసులతో వాగ్వాదానికి దిగాడు. గంటల తరబడి అదే ప్రాంతంలో కూర్చున్నాడు. మళ్లీ పోలీసులు బయటకు వెళ్లి పోవాలని చెప్పినప్పటికీ.. ఫ్యాన్లు పెట్టండి లేదంటే ఇక్కడ నుంచి వెళ్లనని పోలీసులతో అనగా.. వాగ్వాదం జరిగింది. కాసేపటి తరువాత ఓటు హక్కును వినియోగించుకుని అక్కడ నుంచి ఉడాయించాడు.

టీడీపీ నాయకుల హంగామా

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్ ప్రవేశ ద్వారం వద్ద స్థానిక టీడీపీ నాయకులు హంగామా చేశారు. అక్కడి పోలింగ్ కేంద్రంలో దండాలు పెడుతూ ఓటర్లను ఆకర్షిస్తూ ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు నిలదీయడంతో కొంత ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇంతలో స్థానికులు సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

హనుమత్ వాహనంపై అప్పన్న


హనుమత్ వాహనంపై తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై చక్రవర్తి తిరుమగన్ తిరునక్షత్రం పూజలను సోమవారం విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలో అధిష్టింపజేసి ఉదయం పంచామృతాభిషేకం చేశారు. సాయంత్రం హనుమత్ వాహనంపై స్వామికి తిరువీధి వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై ఆర్జిత సేవల పునరుద్ధరణ


జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సోమవారం ఆర్జిత సేవలను పునరుద్ధరించారు. ఈ నెల 10న స్వామివారి చందనోత్సవం 8వ తేదీ నుంచి 12 వరకు ఆర్జిత సేవలన్నీ రద్దు చేశారు. తిరిగి సోమవారం ఆర్జిత సేవలను పునరుద్ధరించారు. దీనిలో భాగంగా ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలలో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం ,శేషవస్త్రాలు అందజేశారు.

'ఉత్తర'లో పోటెత్తారు


43వ వార్డులో కార్పొరేటర్ ఉషశ్రీతో కలిసి ఓటింగ్‌ను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు


తిక్కవానిపాలెం పోలింగ్ కేంద్రం వద్ద సాయంత్రం 6 గంటల సమయంలో బారులు తీరిన ఓటర్లు


కేంద్రీయ విద్యాలయం వద్ద ఓటు హక్కు వినియోగించుకున్న ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, బాణాల తరుణ్, పార్టీ శ్రేణులు

- ప్రశాంతంగా.. సజావుగా సార్వత్రిక ఎన్నికలు
- నియోజకవర్గంలో 61.52 శాతం ఓటింగ్ నమోదు
- ఎండను సైతం లెక్కచేయకుండా ఓటేసిన ప్రజలు
- ఓటు హక్కు వినియోగించుకున్న యువత
- చివరి నిమిషం వరకు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చిన ఓటర్లు

పోలింగ్ సరళి కొనసాగిందిలా..

ఉదయం 7 నుంచి 9 గంటల వరకు **13%**	ఉదయం 9 నుంచి 11 గంటల వరకు **17%**	11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు **30%**
ఒంటి గంట నుంచి మధ్యాహ్నం 3 వరకు **40%**	3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు **54%**	5 నుంచి రాత్రి 10 గంటల వరకు **61.52 %**

సీతంపేట: విశాఖ ఉత్తర నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగాయి. సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియ.. సాయంత్రం 5 వరకు 54 శాతం నమోదైంది. రాత్రి 10 గంటల వరకు 61.52 శాతం ఓటింగ్ జరిగింది. ఒకటి రెండు చోట్ల చిన్నపాటి వాగ్వాదాలు తప్ప.. 275 పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

మందకొడిగా ప్రారంభమై ఆపై జోరుగా..

ఉదయం 7 గంటలకు మొదలైన ఓటింగ్ మధ్యాహ్నం వరకు మందకొడిగా సాగింది. ఆ తర్వాత జోరందుకుంది. ఉదయం 9 గంటల వరకు కేవలం 13 శాతం, 11 గంటల వరకు 17 శాతం మాత్రమే ఓటింగ్ నమోదు కావడం ఒకింత ఆందోళనకు గురిచేసింది. సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులకు ఓటింగ్‌లో ప్రాధాన్యమివ్వడంతో వారికి ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించిన తర్వాత వారంతట వారే ఓటు వేయడంతో ఓటింగ్ శాతం నెమ్మదించి, బయట జనం పెద్ద సంఖ్యలో బారులు తీరారు. అధికారులు చొరవ తీసుకోవడంతో ఓటింగ్ ప్రక్రియ పుంజుకుంది. మధ్యాహ్నం ఒంటి గంటకు 30 శాతం, 3 గంటలకు 40 శాతం, సాయంత్రం 5 గంటలకు 54 శాతం ఓటింగ్ నమోదైంది. సాయంత్రం 6 గంటలకు క్యూలైన్‌లో ఉన్న వారికి ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం కల్పించారు.

బారులు తీరిన ఓటర్లు

అక్కయ్యపాలెం జ్ఞాననికేతన్ స్కూల్, 46వ వార్డు అతిథి ఫంక్షన్ హాల్, తిక్కవానిపాలెం, రాంజీ ఎస్టేట్ పోలింగ్ కేంద్రాలలో పెద్ద సంఖ్యలో ఓటర్లు బారులు తీరారు. ఉదయం నుంచి ఓటింగ్ మందకొడిగా సాగడంతో జనం మండుటెండను సైతం లెక్కచేయకుండా క్యూలైన్‌లో నిలుచుని ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాత్రి 8 గంటల్లోగా ఓటింగ్ పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని గమనించారు. స్థానిక నాయకులతో మాట్లాడి ఓటింగ్ ఎలా జరుగుతోంది, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు.

➡ జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్, సీతంపేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, బీవీకే కళాశాల, వీటీ హైస్కూల్‌ల్లో ఏర్పాటు చేసిన 19 పోలింగ్ బూత్‌ల్లో ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది. మధురానగర్ ఉన్నత పాఠశాలలో జరిగిన పోలింగ్‌ను కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ పర్యవేక్షించారు.

ఓటింగ్ ఇలా..

➡ 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్, ప్రైమరీ స్కూల్, వాగ్దేవి స్కూల్, ఎన్టీ స్కూల్, జ్ఞాననికేతన్ స్కూల్స్‌లో ఏర్పాటు చేసిన 21 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సజావుగా సాగింది.

➡ 43వ వార్డు వెంకటేశ్వర కాలనీ జీవీఎంసీ స్కూల్‌లో 3, 80 ఫీట్ రోడ్ వాటర్ ట్యాంకు వద్ద 1, కేవీ స్కూల్‌లో 5, ఎన్జీజీవోస్ కాలనీలో 5, లలితా నగర్‌లో 3, జగన్నాథపురం జీవీఎంసీ ప్రైమరీ స్కూల్‌లో 1 చొప్పున ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా ఓటింగ్ జరిగింది, కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ పర్యవేక్షించారు.

➡ 44వ వార్డు కేంద్రీయ విద్యాలయంలోని 11 పోలింగ్ బూత్‌ల వద్ద పెద్ద సంఖ్యలో ఓటర్లు బారులు తీరారు. ఎంటీసీ పాలెం ఉర్దూ స్కూల్‌లో 1, వెంకటేశ్వర కాలనీ జీవీఎంసీ స్కూల్‌లో 2, షాదీఖానాలో 2, ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో 2 చొప్పున ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రశాంతంగా సాగింది. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్, బాణాల శ్రీనివాసరావు, నాయకుడు బాణాల తరుణ్ పర్యవేక్షించారు.


ఓటేసిన 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి

ఓటర్ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెం కేంద్రీయ విద్యాలయం, జీవీఎంసీ ప్రైమరీ స్కూల్ వెంకటేశ్వర కాలనీ, తిక్కవానిపాలెం, సంజీవయ్య కాలనీ, మినీ సూయేజ్ ఫారం, మర్రిపాలెం ప్రాంతాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. తిక్కవానిపాలెం జీవీఎంసీ పాఠశాల ప్రాంతంలో సాయంత్రం 6 గంటలు దాటాక కూడా క్యూలైన్లలో ఓటర్లు నిల్చున్నారు. వీరికోసం పోలింగ్ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి స్లిప్‌లు పంపిణీ చేసి వారంతా ఓటు వేసే వరకు పోలింగ్ కొనసాగించారు. క్యూలో ఉన్న ఓటర్ల కోసం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు తాగునీరు, బిస్కట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

ఓటేసిన కొండవాలు ప్రజలు

కంచరపాలెం: జీవీఎంసీ 46, 47, 48, 54, 55 వార్డుల్లోని కొండవాలు ప్రాంతాల ప్రజలు ఓటేశారు. కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, 104 ఏరియా, రాంజీ ఎస్టేట్, కప్పరాడ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ప్రజలు బారులు తీరి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రతి బూత్ వద్ద ఓటర్లకు ఓటర్ స్లిప్పులను కార్యకర్తలు స్వచ్ఛందంగా అందజేశారు.

పటిష్టంగా పోలీస్ బందోబస్తు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులోని పోలింగ్ కేంద్రాల్లో ప్రజలు ప్రశాంతంగా తమ ఓట్లు వేశారు. నక్కవానిపాలెం, పీ అండ్ టీ కాలనీలోని ఎస్ఎంసీ హైస్కూల్‌లో 150, 167, 168, 170, గాంధీనగర్‌లో 145, 146, 147, సీతమ్మధార వసంతబాల స్కూల్‌లో 155 నుంచి 160 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్క ఓటర్ క్యూలో ఉండి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎటువంటి అల్లర్లు జరగకుండా పటిష్టమైన పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. నక్కవానిపాలెం ప్రైమరీ స్కూల్‌లో 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి దంపతులు ఓటు వేశారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద దివ్యాంగుల కోసం వీల్ చైర్లు అందుబాటులో ఉంచారు.

ఓటేసిన శాసనసభ అభ్యర్థులు

సీతమ్మధార: సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తర నియోజకవర్గ అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. జీవీఎంసీ 14వ వార్డు మారుతీనగర్‌లోని 176 పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కె.కె.రాజు ఓటు వేశారు. 24వ వార్డు వసంతబాల విద్యావిహార్‌లోని 160 బూత్‌లో బీజేపీ అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజు ఓటేశారు.

2019లో 62.65%
2024లో 61.52% (ప్రస్తుతానికి)

➡ ఉత్తర నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో సాయంత్రం 5 గంటల వరకు 52 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 7 గంటలకు మొదలై రాత్రి 11.30 గంటల సమయంలో 60 శాతం నమోదుతో పోలింగ్ ముగిసింది. మొత్తంగా 2019 ఎన్నికల్లో 62.65% పోలింగ్ నమోదైంది.

➡ 2024 ఎన్నికల్లో సాయంత్రం 5 గంటల వరకు 54 శాతం పోలింగ్ నమోదైంది. 2 శాతం ఓటింగ్ పెరిగింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమై రాత్రి 10 గంటల సమయం వరకు 61.52 శాతం పోలింగ్ నమోదైంది. పూర్తి ఓటింగ్ శాతాన్ని అధికారులు మంగళవారం వెల్లడిస్తారు.


వెంకటేశ్వర కాలనీ బూత్ వద్ద బారులు తీరిన ఓటర్లు


క్యూలో ఉన్న ఓటర్లకు తాగునీరు, బిస్కట్ ప్యాకెట్లు అందిస్తున్న పార్టీ శ్రేణులు


రాంజీ ఎస్టేట్‌లో పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల రద్దీ


సీతంపేట జీవీఎంసీ ప్రైమరీ స్కూల్‌లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఓటర్లు


అక్కయ్యపాలెం హైస్కూల్‌లో కూతురి సాయంతో ఓటేయడానికి వచ్చిన అమ్మాజీ


కేంద్రీయ విద్యాలయం వద్ద బూత్‌లో ఓటేసి వస్తున్న వృద్ధురాలు

ఓటేసిన యువ కెరటం

- మొదటి సారి ఓటు హక్కు వినియోగించుకున్న యువత

సీతంపేట: ప్రజాస్వామ్య దేశంలో ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడంలో యువత భాగస్వామ్యం కావాలని మేధావులు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీవో ఆర్గనైజేషన్లు, సోషల్ మీడియా చేసిన ప్రచారం ఫలించింది. దేశంలోని ప్రతి పౌరుడికి భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుపై యువతలో చైతన్యం పెరిగింది. ఓటు నమోదుతోపాటు ఓటు హక్కు వినియోగంపై యువత ఆసక్తి చూపిస్తున్నారు. ఉత్తర నియోజకవర్గంలో 18 ఏళ్లు నిండిన యువ ఓటర్లు మొదటి సారిగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఉత్తరలోని 17 వార్డుల్లో కొత్త ఓటర్లు ఉత్సాహంగా ఓట్లు వేశారు. యువత భవిష్యత్తును తీర్చిదిద్దే నేతల ఎన్నికలో భాగమయ్యారు.


నక్కవానిపాలెం పోలింగ్ కేంద్రంలో మొదటి సారి ఓటు వేసిన యువత

యువత ఆనందం

సీతమ్మధార: తొలిసారి ఓటు వేసే అవకాశం రావడంతో పలువురు స్థానిక యువత ఆనందం వ్యక్తం చేశారు. తమ తల్లిదండ్రులు, స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లి వారి ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

మర్చిపోలేని అనుభూతి



మొదటి సారి ఓటు వేశాను. చాలా ఆనందంగా ఉంది. ఈ అనుభూతిని మర్చిపోలేను. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లోని 117 బూత్‌లో మా అమ్మతో వచ్చి ఓటేశాను. సమర్థవంతమైన నాయకులను ఎన్నుకోవడంలో యువత ఓటు హక్కు తప్పకుండా వినియోగించుకోవాలి.

– కె.రూప, అక్కయ్యపాలెం

చిన్నప్పటి కల నెరవేరింది



చిన్నప్పటి నుంచి ఎప్పుడెప్పుడు ఓటు వేస్తానా అని ఎదురుచూశాను. నా కల ఇప్పటికి తీరింది. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో ఓటు వేశాను. మొదటి సారి వేలికి సిరా చుక్క వేశారు. ఓటింగ్ చాలా పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. అద్భుతమైన సాంకేతికతను ఉపయోగిస్తున్నారు.

– పి.లీలాశ్రీ, అక్కయ్యపాలెం

మంచి నాయకుడికే నా తొలి ఓటు



ప్రజలకు మంచి చేస్తున్న నాయకుడికే నా తొలి ఓటు వేశాను. పీ అండ్ టీ కాలనీ ఎస్ఎంసీ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నాను. ఎంతో ఆనందంగా ఉంది.

– ప్రావీణ్య, డిగ్రీ విద్యార్థిని

అభివృద్ధి, సంక్షేమానికి ఓటేశాను



రాష్ట్రంతోపాటు విశాఖ ఎంతో అభివృద్ధి చెందాయి. ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయి. నా తొలి ఓటు సంక్షేమాభివృద్ధికి వేశాను. నక్కవానిపాలెం ప్రైమరీ స్కూల్ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నాను.

– సాడి చార్మికారెడ్డి, ఏయూ విద్యార్థిని, నక్కవానిపాలెం


చాలా సంతోషంగా ఉంది



మొదటి సారి ఓటు వేయడం చాలా సంతోషంగా ఉంది. నక్కవానిపాలెం ప్రైమరీ స్కూల్ పోలింగ్ బూత్‌లో ఓటు వేశాను. ప్రజలకు మేలు చేసే నాయకుడు ఈ ఎన్నికల్లో గెలవాలని ఆశిస్తున్నాను.

– భాగ్య, విద్యార్థిని, నక్కవానిపాలెం

కర్ఫ్యూను తలపించిన రహదారులు


జనసంచారం లేక బోసిపోయిన అల్లిపురం


నిర్మానుష్యంగా కెప్టెన్ రామారావు జంక్షన్

అల్లిపురం: ఒకపక్క ఎండ వేడి.. మరో పక్క ఓట్ల పండగ కావడంతో సోమవారం అన్ని చోట్ల నిర్మానుష్య వాతావరణమే కనిపించింది. దాంతోపాటు ఎన్నికల నేపథ్యంలో లేబర్ హాలిడే ప్రకటించడంతో దుకాణాలన్నీ దాదాపు మూసివేయడంతో రోడ్లన్నీ జనసంచారం లేక బోసిపోయాయి. ఎన్నికల కేంద్రాల వద్ద మాత్రమే జనం బారులు తీరి కనిపించారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖవాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

నమో శివరుద్రాయ

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామి వారికి విశేషంగా అభిషేకాలు, పూజలు జరిగాయి. అడవివరం, విజినిగిరిపాలెం,కృష్ణానగర్ తదితర ప్రాంతల నుంచి భక్తులు తరలి వచ్చారు. పరమేశ్వరుడికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మహిళలు ఉమాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు.

సత్యసాయి విద్యా విహార్‌లో నూరు శాతం ఉత్తీర్ణత

ఎంవీపీ కాలనీ: సీబీఎస్ఈ 10వ తరగతి ఫలితాల్లో ఎంవీపీ కాలనీలోని శ్రీసత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు సత్తా చాటారు. 2023–24కు విద్యా సంవత్సరానికి సంబంధించి 184 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 184 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 115 మంది విద్యార్థులు 75 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించారు. 32 మంది విద్యార్థులు 90 నుంచి 99 శాతం మార్కులు, 59 మంది 80 నుంచి 89 శాతం మార్కులు, 49 మంది 70 నుంచి 79 శాతం మార్కులు కైవసం చేసుకున్నారు. దీంతో పాటు 35 మంది విద్యార్థులు 60 నుంచి 69 శాతం మార్కులు సాధించారు. మాస్టర్ జి.శ్రీవాత్సవ్, కుమారి అదితి శతాక్షిలు 97.8 శాతం మార్కులతో స్కూల్ టాపర్స్‌గా నిలిచినట్లు పాఠశాల యాజమాన్యం వెల్లడించింది. శ్రీసత్యసాయి విద్యావిహార్ పాఠశాల కన్వీనర్ ఎస్‌జీ చలం, ప్రిన్సిపాల్ చేకూరి వరలక్ష్మి విద్యార్థులను అభినందించారు.